నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
సోమవారం | 29 జనవరి 2024 | www.navatelangana.com

నిండుపూత





నవతెలంగాణ-నిజాంపేట

మండలంలోని శివార్లలో ఎక్కడ చూసినా మామిడి చెట్లకు పూత ఇరుగ పూసింది. మామిడి తోటలలో ఎక్కడ చూసినా పువ్వుతో నిండిన చెట్లే కనిపిస్తున్నాయి. చూడడానికి ఎంతో అందంగా ఆకర్షిస్తున్నాయి. మండలంలోని తిప్పనగుల్ల, నిజాంపేట, చల్మెడ, నస్కల్ శివారులోని మామిడి తోట నిండు పువ్వుతో కనిపిస్తోంది. ఈసారి మామిడి కాయలు, పండ్లకు ఎలాంటి కొదవ లేదనిపిస్తుంది. మామిడికాయలతో పచ్చళ్లను, టంకర్లను తయారు చేసుకోవడానికి మంచి గిరాకీ ఉంటుందని మామిడి తోటల యజమానులు అంటున్నారు. ఈసారి అధిక దిగుబడి వచ్చి మంచి లాభాలు వచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయంటున్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేయండి

- మంత్రి సీతక్కకు డీబీఎఫ్ నేత పి.శంకర్ విన్నపం



నవ తెలంగాణ - మిరు దొడ్డి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసి కూలీల హక్కులను కాపాడాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు డీబీఎఫ్ నేత పి.శంకర్ విన్నవించారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడం, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సెంటర్ (ఎన్ ఎం ఎస్), ఆధార్ బేస్ డ్ వేతనాల చెల్లింపు పద్ధతులను చేపట్టి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పని హక్కులను కాలరాస్తోందని చెప్పారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం సైతం ఉపాధి హామీ చట్టాన్ని అడుగడుగునా ఉల్లంఘించిందని ఆరోపించారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం సంవత్సరంలో కుటుంబానికి వంద రోజుల పని కల్పించి, కనీస వేతనం, ఆడ మగ అనే తేడా లేకుండా సమాన వేతనం చెల్లించాలని చట్టం ఆదేశిస్తుందని గుర్తు చేశారు. తాను వినతిపత్రంలో పేర్కొన్న అన్ని విషయాలపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అసిస్టెంట్ యోగ టీచర్లకు సర్టిఫికెట్ల ప్రదానం



నవ తెలంగాణ - సిద్దిపేట

ఆరోగ్య పరిరక్షణకు యోగ కీలకమని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ పతాంజలి యోగ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రంగాచారి అన్నారు. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ పతాంజలి యోగా ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న కాసోజు శ్రీనివాస్, గోపిశెట్టి బిక్షపతి, జీ దేవందర్ గౌడ్, ఎలిగేటి కృష్ణమూర్తి, బొజ్జ అశోక్, రాజూరి నగేష్ లకు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎన్ జీవో భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ యోగ టీచర్ల సర్టిఫికెట్లను రంగాచారి, యువభారత్ జిల్లా అధ్యక్షుడు పెద్ది మనోహర్ లు ప్రధానం చేశారు. కార్యక్రమంలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ పతాంజలి యోగా సభ్యులు మల్లేషం, పుదిల్ల శ్రీను, శ్రీహరి, కనకరాజు, జూలురి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటం చేసి.. నామమాత్రంగా వెలుగులు





నవ తెలంగాణ మిరు దొడ్డి

ఆర్భాటంగా ఏర్పాటు చేశారు.. నామమాత్రంగా వెలిగించారు. ఒక్క రోజుకే రోడ్డుపై జిగేల్మనిపించిన వెలుగులు కనుమరుగయ్యాయి. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి రెండు రోజుల క్రితం నూతనంగా ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై లైట్లను ప్రారంభించారు. మిట్ట మధ్యాహ్నం ప్రారంభించిన లైట్లు ఆరోజు మాత్రం జిగేల్మన్నాయి. ఒక రోజు తర్వాత వాటికి విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో మళ్లీ మిరుదొడ్డి మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డులో చీకట్లు అలుముకున్నాయి. ఒక్కరోజు ఆర్భాటం చేసి ఇలా వదిలేయడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా ఎమ్మెల్యే ప్రారంభించిన పనులు ఒక్క రోజుకే గాలి వదిలేసారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో ఇలాంటి పరిస్థితి ఉంటే గ్రామాల్లో విద్యుత్ సమస్య ఎలా ఉందో తెలుస్తుందని, దీనికి తోడు నేడు సర్పంచులు పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో ఎక్కడ చూసిన చీకటిమయంగానే దర్శమించనున్నాయి. అధికారుల పాలన రావడంతో వారు ప్రజాప్రతిల్లా వ్యవహరిస్తారా? లేదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

త్రివర్ణ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని పెరకబండ గ్రామంలో త్రివర్ణ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల నియమాకం అదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా కొంపెల్లి సుమన్, ఉపాధ్యక్షుడిగా గాలిపెల్లి శ్రీనివాస్, కొంపెల్లి మధు,ప్రధాన కార్యదర్శిగా కొంపెల్లి అరవింద్, కోశాధికారిగా లింగంపెల్లి జైపాల్, సంయుక్త కార్యదర్శిగా కొంపెల్లి సిద్దు, కొంపెల్లి అజయ్ నియమాకమైయ్యారు.నూతన కార్యవర్గ సభ్యులను ఉప సర్పంచ్ కొంపెల్లి బాబు అభినందించి శాలువా కప్పి సన్మానించారు. కొంపెల్లి ప్రశాంత్,గాలిపెల్లి సంపత్,కొంపల్లి ప్రభాకర్,కొంపెల్లి ప్రసాద్,లింగంపల్లి అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్



నవతెలంగాణ కొండపాక

కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తొగుట మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మంచాల చిన్న శ్రీనివాస్ డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు సుమారు 200 మంది కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే 6 గ్యారంటీల పథకాలతో పేద బడుగు బలహీన వర్గాల వారు అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు.

అభివృద్ధిలో మేం వెంటపడతాం



నవ తెలంగాణ - సిద్దిపేట

'కాంగ్రెస్ మాట ఇస్తే వెనక్కి తీసుకోదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ వెంట పడతాం. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, బీఆర్ఎస్ నాయకులు అనాలోచిత మాటలు మాట్లాడుతున్నారు. మీరు వెంటపడుదు కాదు. అభివృద్ధిలో మేం మీ వెంటపడతాం' అని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కోఆర్డినేటర్ దాసరి రాజు అన్నారు. సిద్దిపేటలో వారు ఆదివారం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ ఇస్తామని మాట ఇచ్చిన ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశామని అది గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండునెలలు కాకముందే బిఆర్ఎస్ నాయకులకు కడుపు మంట ఉందని, అందుకే ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ కు అధికారం ఇచ్చిన కూడా బిఆర్ఎస్ కు ఇంకా బుద్ధి రాలేదనీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలు అమలు చేసి తీరుతామని, అప్పుడైనా బిఆర్ఎస్ నాయకులు సిగ్గు తెచ్చుకొని కాంగ్రెస్ మంచి ప్రభుత్వం అని చెప్పుకునే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ప్రజలు ఎవరు కూడా అధైర్య పడవద్దని , బిఆర్ఎస్ కల్లబొలి మాటలు నమ్మవద్దని , కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గయాజుద్దీన్, రాకేష్, సంపత్, రాకేష్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల మార్పుపై ఆశలు

- అందుకే కుల గణన అంటున్న పార్టీలు
- ఫిబ్రవరి 2తో సర్పంచుల పదవీ కాలం ముగింపు
- ముందే కూసిన స్పెషల్ అధికారుల పాలన
- రిజర్వేషన్ల ప్రక్రియ ఉంటే గజ్వేల్‌లో అధికార పార్టీకి కలిసి వస్తుందంటున్న నాయకులు



నవతెలంగాణ -గజ్వేల్

ఫిబ్రవరి రెండో తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగుస్తుండడంతో ప్రభుత్వం స్పెషల్ అధికారుల పాలను ముందుకు తీసుకొచ్చింది. గత ప్రభుత్వంలో జరిపిన సర్పంచ్ ఎన్నికల్లో ఎక్కువ శాతం బీఆర్ఎస్‌కు సంబంధించిన మద్దదారులు గ్రామాల్లో సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. వారిని ఇంకొంత కాలం కొనసాగిస్తే తలకుమించిన సమస్యలు వస్తాయని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచుల పదవీ కాలంతోనే ముగింపు చెప్పాలని భావించి ముందుగానే స్పెషల్ అధికారుల నియమకాన్ని కావాల్సిన ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా పంచాయతీ కార్యదర్శులకు పూర్తి బాధ్యత ఇచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా ఎన్నికలు జరపాలంటే గత ప్రభుత్వం రిజర్వేషన్లు వారికి అనుకూలంగా చేసుకున్నారని ఆరోపణలు విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కుల గణన చేపట్టి తమ పార్టీకి అనుకూలమైన వ్యక్తులకు పదవులు కట్టబెట్టేందుకు సిద్ధమవుతోంది. అందుకే కుల గణన తెరపైకి వచ్చిందనే చెప్పాలి. ఇందులో భాగంగానే గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 175 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 150 వరకు అప్పటి అధికార పార్టీ సర్పంచులు ఉన్నారు. కుల గణన నిర్వహిస్తే గ్రామాల్లో తమ నాయకులకు కార్యకర్తలకు సర్పంచ్ పదవులను, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పదవులు కట్టబెట్టుకోవచ్చని భావిస్తున్న తరుణంలో ప్రభుత్వం ఆ దశగా అడుగులు వేస్తోంది. కుల గణన చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో గజ్వేల్ నియోజకవర్గ నాయకులు సంబరపడుతున్నారు. దీంతో గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కలిసి వస్తుందని స్థానిక నాయకత్వం భావిస్తోంది. గజ్వేల్ నియోజకవర్గంలో 9 మండలాల్లో 175 సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులను రిజర్వేషన్ల ప్రకారం రంగంలో దించి ఎక్కువ శాతం గెలిచినందుకు ఇప్పటినుండే ప్రయత్నాలు చేస్తోంది. రిజర్వేషన్లపై కూడా రాజకీయ ఒత్తిడి ఉండొచ్చని అందరూ భావిస్తున్నారు. గత ప్రభుత్వం రిజర్వేషన్లు మార్పు చేర్పుల చేయాల్సిన అవసరం ఉందని స్థానిక నాయకత్వం పార్టీ అధిష్టానాన్ని ప్రభుత్వాన్ని కోరుతోంది. గజ్వేల్ నియోజకవర్గంలో 8 మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు అధికార పార్టీకి చెందిన వారు ఉండటం తో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుకున్న స్థాయిలో ఓట్లు సాధించలేకపోయింది. దీంతో రిజర్వేషన్ల మార్పు చేర్పులు కోరుతుంది. సర్పంచుల స్థానాలు కూడా ఎక్కువ శాతం అధికార పార్టీ నాయకులే ఉండటమే కాంగ్రెస్కు ఓట్లు రాలేదని గజ్వేల్ నేతలు భావిస్తున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకొని రిజర్వేషన్ల ప్రక్రియ చేపట్టాలని స్థానిక నాయకత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై . అన్ని ప్రాంతాల నుండి ఈ ఒత్తిడి రావడం వల్ల రిజర్వేషన్లు మార్పు చేయాలంటే కుల గణనా నిర్వహించాలని ప్రభుత్వం భావించింది. గజ్వేల్ మండలం జెడ్పిటిసి ఎంపీపీ స్థానాలు ఎస్సీలకు 10 సంవత్సరాలు కేటయించారు. ప్రస్తుతం ఐదు సంవత్సరాలు పూర్తికాగా మరో ఐదు సంవత్సరాలు ఇదే రిజర్వేషన్లు కొనసాగితే కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల నాయకులు ఇతర సామాజిక వర్గాలు రాజకీయంగా నష్టపోతారని భావిస్తున్నారు. తూప్రాన్, మనోహరాబాద్, జగదేపూర్, వర్గల్, ములుగు, కొండపాక తదితర మండలాల్లో రిజర్వేషన్ల మార్పు కూడా అవసరం ఉంటుందని అక్కడ కూడా బీసీ, ఓసీలు, ఎస్సీల రిజర్వేషన్లు ఉన్నాయి. అంతట మార్పు జరగాలని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకత్వం గట్టిగా కోరుకుంటుంది. గత 10 సంవత్సరాలుగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను నాయకులను కాపాడుకోవాలంటే ఏదైనా ఒక పదవి అప్పగించాలని ఇక్కడి నాయకత్వం భావిస్తుంది. చాలా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ఇప్పటికీ పదవి యోగం రాలేదని చెప్పాలి. త్వరలో జరగనున్న సర్పంచి, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో ఛాన్స్ కొట్టేయాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ ప్రకారం పదవుల కోసం ఆశ పడుతున్న వారికి స్థానాలు దొరికే అవకాశం లేదు. మార్పులు చేర్పులు అవుతూనే రాజకీయ భవిష్యత్తు ఉంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి పై నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్లు ఒత్తిడి తీసుకొస్తున్నారు. నియోజకవర్గంలో 90% ప్రజాప్రతినిధులు అప్పటి అధికార పార్టీ చెందినవారు కావడం వల్ల తమకు ఓట్ల శాతం పెరగలేదని నాయకులు కార్యకర్తలు చెప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలంటే రిజర్వేషన్లు మార్పులు చేర్పులు ఎంతో అవసరం ఉందని క్షేత్రస్థాయిలో తమ పార్టీ మద్దతుదారులు ప్రజాప్రతినిధులుగా ఉంటే ఎలాంటి ప్రోటోకాల్ సమస్య రాదని స్థానిక నాయకత్వం భావిస్తుంది. ప్రస్తుతం రిజర్వేషన్ కొనసాగితే కాంగ్రెస్ పార్టీకి తక్కువ స్థానం దక్కే అవకాశము ఉన్నాయని పార్టీ సీనియర్ నాయకులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం రావడంతో స్థానిక నాయకుల్లో నూతన ఉత్సవం వచ్చింది. పదవులు వచ్చే అవకాశం ఉందని అందరూ భావిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి ఫలితం దక్కి అవకాశం ఉందని స్థానిక కార్యకర్తలు, నాయకులు అంటున్నారు. ఏది ఏమైనా గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మాత్రం కుల గణన జరిగి రిజర్వేషన్లు మార్పు వస్తే తమ రాజకీయ భవిష్యత్తు ఉంటుందని అందరూ ఆశిస్తున్నారు.

16న జరిగే కార్మికుల సమ్మెను జయప్రదం చేయండి



నవతెలంగాణ - మెదక్

బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరగనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం మెదక్ కేవల్ కిషన్ భవనంలో గ్రామ పంచాయతీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆల్ ట్రేడ్ యూనియన్స్, ఉద్యోగ సంఘాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా పేరుతో దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మెతో పాటు గ్రామీణ బంధు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మెలో గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను, విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలని, రాష్ట్రంలో కాలపరిమితి ముగిసిన అన్ని షెడ్యూల్ పరిశ్రమలకు వెంటనే కనీస వేతన జీవోలు ప్రకటించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, రోజుకు 600 కనీస వేతనం కూలీ ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న బకాయి ఉపాధి కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. భారతదేశం డిజిటల్ దేశంగా మారుస్తామని చెప్పి స్వచ్ఛభారత్ పేరుతో గొప్పలు చెప్పుకొంటుందన్నారు. గ్రామీణ స్థాయిలో స్వచ్ఛ కార్మికులుగా పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తూ గ్రామాలను పట్టణాలను పరిశుభ్రంగా పచ్చదనంగా ఉంచుతున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. పారిశుధ్య కార్మికుల జీతాలు కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. ప్రమాద బీమా పెన్షన్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ పని భద్రత పర్మినెంట్ వంటి సమస్యలను పరిష్కరించకుండా గ్రామపంచాయతీ సిబ్బందితో వెట్టిచాకిరి చేయించుకుంటూ వారికి అన్యాయం చేస్తుందన్నారు. కరోనా సమయంలో కార్మికులు తమ ప్రాణాలకు తెగించి గ్రామాలలో పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించారన్నారు .కార్మిక కనీస వేతనాల చట్టాలని గ్రామపంచాయతీ కార్మికులకు అమలయ్యే విధంగా చూడాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, భారత దేశ అంతట ఫిబ్రవరి 16వ తేదీన కార్మికరంగం నిర్వహిస్తున్న సమ్మెలో జిల్లాలోని గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయితీ జిల్లా ఉపాధ్యక్షులు పద్మారావు, నాయకులు నర్సింలు, పద్మయ్య, రాములు, శంకర్, ఎల్లం, మాణిక్యం, పోచయ్య పాల్గొన్నారు.

నిధుల్లేక నిలిచిన పనులు

ఆఖరి మజిలీకి కష్టాలు తీరాలంటే..
మరో రూ.40 లక్షలు అవసరం



నవతెలంగాణ- దుబ్బాక

ఉమ్మడి రాష్ట్రంలో వెనకబాటుకు గురైన తెలంగాణ పట్టణాలు, పల్లెలను ప్రగతి పథంలో నడిపేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ప్రధానంగా మున్సిపాలిటీల్లో అభివృద్ధి కోసం పట్టణ ప్రగతి పేరిట నిధులు విడుదల చేసింది. ఇతర నిధులతో మున్సిపాలిటీల్లో కొత్తగా రోడ్లు, అవసరమున్న చోట డ్రైనేజీలు, ఓపెన్ జిమ్‌లు, పార్కులు, వైకుంఠధామాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేసింది. దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట 11వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20 లక్షలతో వైకుంఠధామ నిర్మాణ పనులను ఏడాది క్రితం మొదలు పెట్టారు. మంజూరైన నిధులతో దాదాపు బర్నింగ్ పాయింట్, ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దహన సంస్కారాలు నిర్వహించేందుకు బోరు, టాయిలెట్లు, మహిళలకు స్నానపు గదులు, వెయిటింగ్ హాల్, గార్డెన్ వంటి ఇతర పనులు పూర్తవ్వాల్సి ఉంది.

మరో రూ.40 లక్షలు అవసరం

ప్రత్యేక సౌకర్యాలతో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులు నిధుల కొరతతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మరో రూ.40 లక్షలు సమకూరితే వైకుంఠధామం పనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని వార్డ్ కౌన్సిలర్ నందాల శ్రీజ శ్రీకాంత్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

30 ఏళ్లుగా ఇబ్బందులు

లచ్చపేట వార్డులో గత 30 ఏళ్లుగా వైకుంఠధామం లేకపోవడంతో దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరికొంత నిధులను సమకూరుస్తే పూర్తవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి నిధులను మంజూరు చేయాలని, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి లను వార్డు కౌన్సిలర్ నందాల శ్రీజ శ్రీకాంత్ కోరుతున్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యం



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

ఆపదలో ఉన్న వారిని ఆదుకొని చేయూత అందించడంలో ఎంతో సంతృప్తి ఉందని ఆపన్న హస్త మిత్ర బృందం గజ్వేల్ అధ్యక్షులు పాశుకంటి బాలచంద్ర అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా ఏన్సాన్‌పల్లిలో సంస్థ ఆధ్వర్యంలో 83వ ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ఏదో ఒక రూపన చేయూతని అందించిన ఘనత ఆపన్న హస్త మిత్ర బృందానికి దక్కుతుందన్నారు. సంస్థగా ఏర్పడి ఇప్పటివరకు 83 ఆర్థిక సహాయాలు చేసామన్నారు. కడు పేదరికంలో ఉండి ఆర్థిక పరిస్థితి బాగోలేక ఆసుపత్రి పాలైన వారికి చేయూతనియడమే మా ప్రధాన లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ఎన్సాన్ పల్లి గ్రామానికి చెందిన సిరిసిల్ల సాయి చరన్ బ్లడ్ క్యాన్సర్ తో బాధపడుతున్నరని తెలుసుకున్నమన్నారు. వెంటనే వారి కుటుంబానికి మా వంతు సాయంగా రూ.20 వేలుఅందివ్వడం జరిగిందన్నారు. ఇలాంటి కుటుంబాలు మరెన్నో ఉన్నాయని వారిని ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోషాధి కారి కొల్లూరి శ్యామ్ ప్రసాద్, సభ్యులు, కొలిచెలిమే స్వామి, రవి కుమార్, సత్యనారాయణ, కృష్ణ, శ్రీకాంత్, గిరిబాబు, అనిల్, శ్రీకాంత్ ఎంపీటీసీ ప్రశాంత్ గౌడ్,సర్పంచ్ రవి గౌడ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలను అమలు చేయడంలో కేంద్రం విఫలం

సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి



నవ తెలంగాణ మిరుదొడ్డి


కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తవుతున్నా రైతులు, కార్మిక చట్టాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. ఆదివారం అక్బర్‌పేట భూంపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ మండల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై గోపాలస్వామి మాట్లాడుతూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్ రూ.10 వేలు అందరికీ చెల్లించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్స్, రైతు, విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులు, రవాణా, హమాలీ కార్మికులకు వెల్ఫర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అమ్ముడును విరమించాలన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను కాశాయీకరణను విరమించాలన్నారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొనాలన్నారు. హమాలీ యజమానికి జనవరి 29 నుండి సమ్మె నోటీసులు ఇవ్వాలన్నారు. ఫిబ్రవరి 1 నుంచి ప్రతి గ్రామంలో ఫిబ్రవరి 16 వరకు ప్రచార, నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం హమాలీ కార్మిక సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుమ్మరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా లింగంపేట ఎల్లయ్య, మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జూకంటి రాజిరెడ్డి,నర్సుగారి ఎల్లం,నీల స్వామి,చెక్క స్వామి, ఎదురు బాలరాజు, కూతురు స్వామి ధర్మారం రాజు, పార బలపొచయ్య,ర్యకం దాసు,గువ్వలేగి రాజు, కుంటకొమ్ము నర్సింలు,కుమార స్వామి,కుమ్మరి ఎల్లయ్య, కుమార్, గొడుగు స్వామి,తిమ్మ స్వామి, కార్మికులు పాల్గొన్నారు.

మెదక్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరేస్తాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

నవతెలంగాణ - మెదక్

ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటి బీఆర్ఎస్ జెండాను ఎగరేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని వైస్రాయ్ గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే, పద్మాదేవేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ 'రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి బాధ్యత, హుందాతనం పెరగాలి. ఆ కుర్చీని కించపరిచే విధంగా ఇంకా ప్రతిపక్షంలో ఉన్న విధంగానే రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారు. రాష్ట్ర అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోకస్ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను ఏ విధంగా జైలుకు పంపాలి... ఏ విధంగా ఇబ్బందులకు గురి చేయాలని అని ప్రయత్నిస్తోంది' అని అన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షాల మీద దాడి మానుకొని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల మీద దృష్టి పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో గెలిచి ఎనిమిది నెలలు అయినా 6 గ్యారంటీలను అమలుచేసే పరిస్థితి లేదన్నారు. కర్ణాటకలో 20కి పైగా ఎంపి స్థానాలు బిజెపి గెలిచే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ వచ్చాక మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలుతున్నాయని, వైరింగ్ దుకాణాలు ఇన్వర్టర్ జనరేటర్ షాపులు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎన్నికల ప్రచారంలో అబద్ధ ప్రచారాలు గ్లోబల్ ప్రచార చేశారని విమర్శించారు. 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రోజుకు 14 గంటల కరెంటు మాత్రమే ఇస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ ఫైల్ మీద సంతకం పెడతామన్నారని, రెండు నెలలైనా అమలు చేయలేదన్నారు. రైతు రుణమాఫీ చేయకుండా పార్లమెంట్ ఎన్నికలకు పోతే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓట్లు వేస్తారా అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు రైతుబంధు వేస్తే కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేసిందన్నారు. రాష్ట్రంలో 44 లక్షల పెన్షన్ దారులు ఉన్నారని, వారికి పెన్షన్ రూ. 4000 ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ధాన్యాన్ని అమ్ముకోకుమని రైతులకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ప్రేమ చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకముందే బోనస్, రెండు లక్షల రుణమాఫీ, పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దానితోపాటు మార్చి 17 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు నిండుతుందని, ఇచ్చిన హామీలన్నిటిని అమలు చేయాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే మళ్లీ ఉద్యమం చేయాల్సిన అవసరం ఉంటుందని, రోడ్లు ఎక్కాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బెదిరిస్తున్నారని, పళ్ళ రాజేశ్వర్ రెడ్డి మీద అక్రమ కేసులు



పెట్టి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని కార్యకర్తలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. పాలన చేతకాక ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురి చేస్తూ కేసులో పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో దళిత బంధును ప్రవేశపెట్టి వారి అకౌంట్లో డబ్బులు వేస్తే వాటిని ఫ్రీజ్ పెట్టి దళితుల ఉసురుపోసుకున్నారని మండిపడ్డారు. గొల్ల కురుమలు కట్టిన డీడీలు ఇవ్వకుండా, గొర్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మెదక్ కలెక్టరేట్ ను ప్రారంభించడానికి కెసిఆర్ వచ్చినప్పుడు మెదక్ పట్టణానికి 50 కోట్లు, ఏడుపాయల అభివృద్ధి కోసం రూ.100 కోట్లు నిధులను కేటాయించారని, ఇప్పుడు ఆ నిధులన్నీ వెనక్కి వెళ్లాయన్నారు. మెదక్ ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో చేస్తామన్న పనులు చేయలేదని, రైతుబంధు ఇవ్వలేదని, ఈ విషయాలను ఎండగడుతూ రీల్స్ చేసి సోషల్ మీడియాలో పెట్టాలని యువకులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ప్రజల్లోకి తీసుకెల్లి చర్చ పెట్టాలన్నారు. మహాలక్ష్మి పథకంలో బాగంగా ఉచిత బస్సు ప్రయాణం ఇస్తే సరిపోదని, రూ. 500 కే గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ. 2500 ఇచ్చినప్పుడే ఆ పథకం పూర్తి అవుతుందన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగిరే విధంగా ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. కాంగ్రెస్ మెడలు వంచైనా సరే ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పోరాటం చేస్తామన్నారు. గతంలో కేటీఆర్ రాష్ట్ర అభివృద్ధి కోసం దావోస్ కు వెళ్తే దండగ అన్నారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి, శ్రీధర్ బాబు దావోస్ కి వెళ్తే పండగనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ జూట మాటలు అబద్ద ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని తెలియజేశారు. అంతకుముందు జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే యం.పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మొన్న జరిగిన ఎన్నికల్లో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎవరు వెనుకడుగు వేయకుండా చిన్న ఆటంకంగా భావిస్తూ ముందుకు దూసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ భవన్ లో పార్లమెంటు సమావేశం జరిగినప్పుడు హరీష్ రావు కేటీఆర్ కి ఏడు నియోజకవర్గాల్లో ఆరు బిఆర్ఎస్ పార్టీ గెలిచిందని, ఒకటి మాత్రమే కాంగ్రెస్ గెలిచిందన్నారు. ఏడు నియోజకవర్గాల స్థాయికి దీటుగా పనిచేసి భారీ మెజార్టీ ఇస్తామని తెలిపారు. మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆర్ సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మెదక్ నియోజకవర్గంలోని పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు యం. గంగాధర్, అంజగౌడ్, గజవాడ నాగరాజు, మహేందర్ రెడ్డి, రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఎంపీపీలు శేరి నారాయణ రెడ్డి, యమునజయరాం రెడ్డి, సిద్దిరాములు, శంకరంపేట్ ఆర్ జడ్పీటీసీ మాధవి రాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

2

సంగారెడ్డి

సోమవారం | 29 జనవరి 2024 | www.navatelangana.com

గుమస్తా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట శ్రీ మల్లికార్జున స్వామి సత్తి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జోగిపేట గుమస్తా సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేయించాలన్న విజ్ఞప్తి మేరకు వారు ముందుకు వచ్చి భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుమాస్తా సంగం అధ్యక్షులు డాకూరి శంకరయ్య, ప్రధాన కార్యదర్శి ఎర్రగోళ్ల మహేష్ యాదవ్, కోశాధికారి కే. నర్సింలు, ఉపాధ్యక్షులు నవాజ్, దుర్గయ్య, డైరెక్టర్లు మాసగొని లక్ష్మణ్, కడాల రాములు, నాగరాజు, జి.కృష్ణ, జి.మల్లేశం, ఆనంద్, బలరాం, మల్లేశం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



నవతెలంగాణ-పుల్కల్

ప్రయాణీకులు, విద్యార్థులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు మార్గమధ్యంలో మొరాయించింది. దాంతో వారతంతా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే..

ఆదివారం ఉదయం సింగూరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న ఓ ఆర్టీసీ పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలోని ముత్యంపేట చౌరస్తా వద్ద మొరాయించింది. దాంతో ప్రయాణీకులు, స్పెషల్ క్లాసుల కోసం పాఠశాలలకు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు, ఉద్యోగస్తులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ సిబ్బంది ఎప్పటికప్పుడు బస్సుల్లో క్షుణ్ణంగా పరిశీలించి.. ఫిట్‌గా ఉన్న బస్సులనే నడపాలని ప్రయాణీకులు కోరారు.

నాణ్యమైన విద్య కోసం కృషి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

సుదూర ప్రాంతాల్లో నివసించే షెడ్యూల్ తెగల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం కోసం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను స్థాపించినట్టు స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, డైరెక్టర్ అనూష భారత్ రాజు అన్నారు. నారాయణఖేడ్ మండలంలోని జూకల్ శివారులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం విద్యా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలల అకాడమీ, నాన్ అకాడమీ విద్యా రెండింటిని ప్రాధాన్యతమిస్తూ సమగ్రాభివృద్ధికి దోహదం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. సంగారెడ్డి జిల్లాలో 17 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పది రోజులపాటు విద్యపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో రుతు చక్రం, ఆరోగ్యం, ప్రాథమిక హక్కులు, హింస గురించి వివరించడం జరుగుతుందన్నారు. సంస్కృతి, సమాజం నిర్దేశించినట్లు బలం, అందం, లింగం యొక్క ప్రమాణాలను ఆత్మ పరిశీలన గురించి పది రోజులపాటు అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. సవాళ్లను అధిగమించడం కోసం వివాదాలను పరిష్కరించడానికి సులభమైన మార్గాలను గురించి తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి

నవతెలంగాణ-న్యాల్‌కల్

మెటల్‌కుంట గ్రామాభివృద్ధి నిరంతరం కృషి చేస్తున్నాని ఆ గ్రామ సర్పంచ్ పిటర్ రాజు అన్నారు. గ్రామంలోని బీసీ కాలనీలో జెడ్పీ నిధులతో సీసీ డ్రైనేజ్ కాలువల పనులను ఆదివారం టెంకాయలు కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ రెడ్డి, పాండురంగారెడ్డి, వెంకటేష్, సంజీవ్, రమేష్, వార్డ్ మెంబర్ తదితరులున్నారు.



గుమ్మడిల వర్తక సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణ

నవతెలంగాణ-గుమ్మడిదల

కొన్నేండ్లుగా గుమ్మడిదల వర్తక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని.. ఆ సంఘానికి ప్రతీయేడు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ యేడుకు సంబంధించి ఆదివారం జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, సర్పంచ్ సిమ్మల నరసింహారెడ్డి పర్యవేక్షణలో వర్తక సంఘ సభ్యులందరూ కలిసి ఓటింగ్ పద్ధతి ద్వారా నూతన సభ్యులను ఎన్నుకున్నారు. వర్తక సంగం అధ్యక్షుడిగా నలుగురు వ్యక్తులు పోటీ చేయగా వారిలో ఆకుల సత్యనారాయణ 87 ఓట్లతో గెలుపొందారు. వారిని వర్తక సంఘం సభ్యులంతా కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు కార్యక్రమంలో కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మెన్ పడమటి లక్ష్మారెడ్డి నాయకులు చిమ్మల గోవర్ధన్ రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, ఎం నరేందర్ రెడ్డి, రామాగౌడ్, తులసీదాస్, ఆకుల ఆంజనేయులు, సూర్యనారాయణ, రవీందర్ రెడ్డి, దామోదర్ చారి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీలు పట్టివేత

నవతెలంగాణ-న్యాల్‌కల్

నిబంధనలను విరుద్ధంగా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న రెండు లారీలను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని మామిడ్గి శివారులో లారీలను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు హద్నూర్ ఎస్సై రామునాయుడు తెలిపారు. రెండు లారీలకు రూ.20 వేల జరిమానా విధించినట్టు న్యాల్‌కల్ తహసీల్దార్ భాను కిరణ్ చెప్పారు.



యువకుల్లోని నైపుణ్యం వెలికి తీయడానికే టోర్నమెంట్

నవతెలంగాణ-న్యాల్‌కల్

యువకుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి మండలంలోని బసంత్‌పూర్ గ్రామంలో నిర్వహించిన బీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ఎంతో దోహదపడిందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత 12 రోజులుగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో.. ఆదివారం ఫైనల్ మ్యాచ్ హెూరాహెూరిగా సాగింది. టోర్నమెంట్‌లో మొత్తం 20 జట్లు పాల్గొన్నాయి. అయితే ఫైనల్ మ్యాచ్‌లో అమలాపూర్ విన్నర్‌గా నిలిచింది. దాంతో ఆ టీముకు రూ.20,000 నగదు బహుమతితో పాటు కప్ అలాగే రన్నర్‌కు రూ.10,000 నగదు, కప్‌ను అందజేశారు. బీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ స్పాన్సర్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బి.శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌కు హాజరైన నాయకులను నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీనివాస్ రెడ్డి, బసంతపూర్ యువ నాయకుడు అబ్బాస్‌అలి, రేజింతల్ శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నరసింహారెడ్డి, సామెల్, శ్రీకాంత్ రెడ్డి, అశోక్, ఆర్గనైజర్ లాలప్ప, ఇస్మాయిల్, జీవన్ తదితరులున్నారు.



సీసీ కెమెరాలతో దొంగతనాలకు అడ్డుకట్ట

నవతెలంగాణ-న్యాల్‌కల్

సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలకు అడ్డుకట వేయోచ్చని మిర్జాపూర్(బి) గ్రామ సర్పంచ్ నిర్మలా జగన్నాథ్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రూ.లక్షలు వెచ్చించి గ్రామంలో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఇప్పటికే అందుకు సంబంధించిన మెటీరియల్ కూడా వచ్చిందని.. త్వరలోనే సీసీ కెమెరాలను ప్రారంభిస్తామన్నారు.

ప్రజల పక్షాన నవతెలంగాణ

- మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి
- నవతెలంగాణ 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కల్హేర్

ప్రతిదినం జనస్వరమై.. పేద ప్రజల పక్షాన నవతెలంగాణ దినపత్రిక అనునిత్యం పనిచేస్తున్నదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. కల్హేర్ మండలంలోని ఖానాపూర్ కేలో గల తన స్వగృహంలో నవతెలంగాణ దినపత్రిక 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం భూపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల కార్మికుల పక్షాన వారి గొంతుకై నవతెలంగాణ దినపత్రిక పనిచేస్తున్నదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి.. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్నదన్నారు. ఉన్నది ఉన్నట్టుగా వార్త రూపంలో రాస్తూ నిజాయితీగా ముందుకు సాగుతున్నదన్నారు. వాస్తవాలను వెలికితీస్తూ నిక్కచ్చిగా వార్తలు రాస్తున్న రిపోర్టర్ ప్రవీణ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నరసింహారెడ్డి, పార్టీ సిర్గాపూర్ మండలాధ్యక్షులు సంజీవరావు పాటిల్, పార్టీ కల్హేర్ మండల ఉపాధ్యక్షులు నీరుడి యాకోబ్, సర్పంచులు కిష్టారెడ్డి, ఎం.శ్రావణ్ కుమార్, గోపాల్ రెడ్డి, ఎంపీటీసీ అంజయ్య సాగర్, ఎంపీపీ తనయుల జలంధర్, వార్డు మెంబర్ నాందేవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ డి.సాయి బాబాగౌడ్, రిపోర్టర్ నీరుడి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.





రిపోర్టర్ పెండ్లికి హాజరైన డీసీసీ ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-కంగ్టి

మండల కేంద్రమైన కంగ్టి కాంగ్రెస్ నాయకుడు వగ్గే బాబు కుమారుడు, రిపోర్టర్ వగ్గే సీమన్ వివాహానికి డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోల చంద్రశేఖర్ రెడ్డి పటేల్ హాజరై వధూవరులను దీవించారు. వారి కుటుంభ సభ్యులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో వగ్గే చిన్న శంకర్, మనోజ్‌పాటిల్, శ్రీనురెడ్డి,వెంకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్టణంలోని 3వ వార్డులో నివాసం ఉంటున్న ముదిరాజ్ కులస్తురాలు చాపల పెంటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. 3వ వార్డు బీఆర్ఎస్ నాయ కుడు జిన్నా విజయ్ కమార్ ఈ విషయం తెలుసుకొని ఆదివారం మృతురాలి ఇంటికెళ్లి సొంతంగా రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. జోగిపేట పట్టణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు పట్లూరి శివ శేఖర్ ఆదేశాల మేరకు ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి తుపాకుల సునీల్ కువార్, నాయకులు సాయిబాబా, రాజు, గంగారం, పారిజాతంలు రూ.5వేలు సహాయం అందించినట్టు వారు తెలిపారు.

దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య, సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అతిమేల మాణిక్ పిలుపు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం, నారాయణఖేడ్‌రూరల్

కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య, సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం బొల్లారంలో సమ్మె కరపత్రాన్ని కే.రాజయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా బొల్లారంలో రాజయ్య, నారాయణఖేడ్‌లో ప్రజా సంఘాల సమావేశంలో మాణిక్‌లు మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం గత పదేండ్లుగా కార్పొరేట్ మతతత్వ విధానాలను అవలంభిస్తున్నదన్నారు. కార్పొరేట్ పెద్దలకు లక్షల కోట్లు మాఫీ చేస్తూ.. కార్మిక, కర్షకులపై అనేక భారాలు మోపుతున్నదన్నారు. ఉపాధి, విద్య, వైద్యం, ఉద్యోగ భద్రత పై దాడి చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ రిజర్వేషన్ తొలగిస్తున్నదన్నారు. దాంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు తీవ్రంగా నష్టపోతారన్నారు. మూడోసారి అధికారంలోకి రావడం కోసం మోడీ అనేక కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాడన్నారు. ఒకవేళ మోడీ మూడోసారి అధికారంలోకి వస్తే దేశంలో రాజ్యాంగం ఉండబోదన్నారు. ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్న చేస్తార న్నారు. నియంత పాలన వస్తుందన్నారు. కాబట్టి మోడీ విధానాలపై ప్రజలందరూ ఉద్యమాలకు రావాలని కోరారు. ఫిబ్రవరి 16న దేశంలోని అన్ని కార్మిక సంఘాలు, వివిధ ఫెడరేషన్లు, అసోసియేషన్లు, రైతు సంఘాలు, కూలీ సంఘాల ఆధ్వర్యంలో దేశమంతట సమ్మె మరియు గ్రామీణ భారత్ బంద్ జరుగుతున్నదన్నారు. ఈ సమ్మె, భారత్ బంద్‌లో కార్మికులు, రైతులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఐడీఏబొల్లారంలో సురేం దర్‌రెడ్డి, చంద్రశేఖర్, సత్తయ్య, ఖేడ్‌లో అంబేద్కర్ సంఘం తాలూకా అధ్యక్షులు కాన్సిరాం, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు సంగమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, కేవీపీఎస్ కల్హేర్ మండలాధ్యక్షులు ప్రవీణ్, ఉపాధ్యక్షులు అశోక్, నిజాంపేట్, కంగ్టి, నాగల్‌గిద్ద, మనూర్ మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.





ప్రముఖులకు నవతెలంగాణ క్యాలెండర్ అందజేత

నవతెలంగాణ-కల్హేర్

నవతెలంగాణ దినపత్రిక 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ గుర్రపు సుశీల అంజయ్యకు రిపోర్టర్ ప్రవీణ్ ఆదివారం అందజేశారు. మండలంలోని మార్డి గ్రామంలో గల ఎంపీపీ స్వగృహానికి వెళ్లి పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎస్.యాకోబు, రాపర్తి సర్పంచ్ ఎం.శ్రావణ్‌కుమార్‌తో కలిసి క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. నవతెలంగాణ తెలుగు దినపత్రిక అనునిత్యం ప్రజల, కార్మికుల పక్షాన నిలుస్తుందన్నారు. వారి సమస్యల మీద వాస్తవాలను వెలికి తీసి నిజాయితీగా వార్తలు ప్రచురణ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనయులు జలంధర్, గ్రామస్తులు ప్రజ్వల్ తనయ్, (చక్కని) జ్యోత్స్న(మిల్కీ) పాల్గొన్నారు.

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్‌తో కలిసి నిజాంపేట సర్పంచ్‌కు అందజేత..

నిజాంపేట సర్పంచ్ జగదీశ్వరచారికి కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాణిక్, మెదక్ జిల్లా కార్యదర్శి సంఘమేశ్వర్‌తో కలిసి నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను రిపోర్టర్ ప్రవీణ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం తాలూకా అధ్యక్షులు కాన్సిరాం, న తెలంగాణ నారాయణఖేడ్ ఇన్చార్జి అరుణ్, కేవీపీఎస్ నాయకులు అశోక్, ప్రకాష్, యోహాన్ ,సతీష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు,

కల్హేర్ మండలంలోని మార్డి గ్రామంలో గల బీఆర్ఎస్ ప్రచార కమిటీ మండల అధ్యక్షులు నాగిరెడ్డికి నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందజేశారు.









పంచాయతీ కార్మికుల నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పుల్కల్

తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మండల కార్యదర్శి విజయ్ కుమార్ చేతుల మీదుగా ఆదివారం పుల్కల్ మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామ పంచాయతీ కార్మికులు సమయపాలన లేకుండా అనునిత్యం గ్రామాల్లో సేవ చేస్తుంటారన్నారు. మురికి కాలువలు శుభ్రం చేయడం, సీసీరోడ్లు, మంచి నీటి సౌకర్యం కల్పించడంతో పాటు చాలా పనులు చేస్తారన్నారు. కానీ వారికి మాత్రం చాలీచాలని వేత నాలే వస్తున్నాయని.. దాంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పనికి తగ్గ వేతనం నెలకు రూ.20,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

అదనపు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలి

- సీఐటీయూ డిమాండ్
- మున్సిపల్ కార్మికుల సమస్యలపైన ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ

నవతెలంగాణ-సంగారెడ్డి

మున్సిపల్ పనిచేస్తున్న కార్మికులను అక్రమంగా తొలగించి.. ఆ స్థానంలో రూ.లక్షల నుంచి రెండు లక్షల వరకు డబ్బులను వేరొకరికి ఆ ఉద్యోగాన్ని అదనపు శానిటరీ విజయబాబు అప్పనంగా అప్పజెబుతున్నాడని.. కాబట్టి ఆయన్ను వెంటనే సస్పెండ్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపల్‌లో అనేక ఏండ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులను సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్ బాబు అక్రమంగా తొలగిస్తూ.. వారి స్థానంలో డబ్బులు తీసుకుని కొత్తవారికి ఆ ఉద్యోగాలు ఇస్తున్నాడన్నారు. కార్మికుడిని మున్సిపల్‌లో తీసు కోవాలంటే కౌన్సిల్ తీర్మానం జరపాలి కానీ.. ఆయన మాత్రం ఎలాంటి తీర్మానం లేకుండానే డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం మారినా.. ఆయన ప్రవర్తన మాత్రం మారలేదన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం కార్మికులను తొలగిస్తే.. ఆ స్థానంలో వారి కుటుంబ సభ్యులను పెట్టుకోవాలని.. కానీ ఇక్కడ మాత్రం అలా జరగడం లేదన్నారు. తన కుటుంబ సభ్యులకు ఉద్యో గాలు ఇచ్చుకుంటున్నాడన్నారు. అంతేకాకుండా కార్మికులకు వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని.. ఆ విషయమై అడిగితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నాడ న్నారు. కార్మికులను ఇబ్బంది పెడుతున్న విజయబాబును ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా అక్రమంగా తొలగించిన కార్మికు లందరినీ విధు ల్లోకి తీసుకోవాల న్నారు. లేనియెడల వారి కుటు ంబ సభ్యులతో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమం సీఐటీయూ నాయకులు శ్రీనివాస్ గౌడ్, దాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-ఝరాసంగం

ఉజ్వల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జహీరాబాద్ టౌన్ రంజోల్‌లో, బూచీనెల్లి మైదానంలో, ఝరాసంగం మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్‌లను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి డా.ఉజ్వల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ గ్రామాలల్లో, తాండాల్లో ఆడుతున్న క్రీడాకారులను ఒక వేదిక ద్వారా పరిచయం చేసి వాళ్ళల్లో దాగివున్న నైపుణ్యాలను గుర్తించడానికే మండల స్థాయి టోర్నీలను నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయి టోర్నీల్లో విన్నర్, రన్నర్ జట్టులకు త్వరలోనే నియోజకవర్గ స్థాయి టోర్నీలో అర్హత కల్పిస్తామన్నారు. నియోజకవర్గ స్థాయి టోర్నీలో విజేతకు రూ.2 లక్షల నగదుతో పాటు ఆకర్షణీయమైన ట్రోఫీ, రన్నర్ జట్టుకు లక్షతో పాటు ఆకర్షణీయమైన ట్రోఫిని ప్రదానం చేస్తారన్నారు. ఈ టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తా మన్నారు. అంతేకాకుండా మండల స్థాయిలో గెలుపొందిన విన్నర్ జట్టుకు కప్‌తో పాటు రూ.50,000, రన్నర్ జట్టుకు కప్పుతోపాటు రూ.30,000 నగదు అందిస్తున్నట్లు వెల్లడిం చారు. ఈ కార్యక్రమంలో ఝరాసంగంలో యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, కోహిర్ మండల పార్టీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, సీనియర్ నాయకులు గొల్ల భాస్కర్, హుగ్గెల్లి రాములు, సంగన్న, గుండప్ప, పెంటన్న, మారుతిరావు పాటిల్, సంగ్రామ్ పాటిల్, అష్రఫ్ అలీ, ఆయా గ్రామాల సర్పం చ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





విగ్రాం రామా గౌడ్‌కు ఘన నివాళులు



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతా పారిశ్రామిక సంస్థ మాజీ చైర్మన్ దివంగత విగ్రాం రామాగౌడ్ రెండవ వర్ధంతిని ఆదివారం పెద్ద శంకరంపేటలో నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రాం రామాగౌడ్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జంగం శ్రీనివాస్ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విగ్రాం వేణుగోపాల్ గౌడ్‌లు మాట్లాడుతూ దాదాపు 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఏ పదవి చేపట్టినా ఆ పదవికి ఎంతో వన్నె తెచ్చారని గుర్తు చేసుకున్నారు. వార్డు స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదిగిన నేతగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మి రమేష్, ఎంపిటిసి వీణసుభాష్ గౌడ్, దాదిగారి గంగాధర్, సురేష్ గౌడ్, బక్కారెడ్డి, సాయిరెడ్డి, అనిల్, సూర్య ప్రకాష్, రజినీకాంత్, రాజు గౌడ్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నస్కల్ జడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ-నిజాంపేట

నస్కల్ జెడ్పీహెచ్ఎస్‌లో ఆదివారం 1999- 2000 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 24 సంవత్సరాల తర్వాత అందరం కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆనాడు చదువు నేర్పిన గురువులకు కోటి కోటి దండాలు అన్నారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని నింపడమే గురువుల కర్తవ్యమని గుర్తు చేశారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన గురువులు స్వర్గీయులు రమణయ్య, గందె మల్లేశం, విద్యార్థి చంద్రారెడ్డి లను తలుచుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హెచ్ఎం సత్యనారాయణ, వెంకటేశం, ఎండి గౌస్, మనోహర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

వ్యవస్థ నిరంతర ప్రక్రియ వ్యక్తులు కొంతకాలమే



నవతెలంగాణ-కౌడిపల్లి

సమాజంలో వ్యవస్థ అనేది నిరంతర ప్రక్రియ అని, వ్యక్తులనేది కొంతకాలమే పదవుల్లో ఉంటారని ఎమ్మెల్యే వాకిటి సునీత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రాయిలాపూర్, జాజితాండాలో రూ.40 లక్షల నిధులతో గ్రామపంచాయతీల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే సునీత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలు పాల్గొని ప్రారంభించారు. సర్పంచులు కురుమ శేఖులు, రమేష్ నాయక్‌ల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీల ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ సర్పంచులు కేసీఆర్ హయాంలోనే గౌరవంగా ఉన్నారన్నారు. కేసీఆర్ మంజూరు చేసిన డబుల్ బెడ్ రూమ్, ఇతర పథకాలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయటం మంచి పద్ధతి కాదన్నారు. నియోజకవర్గంలో రూ.13.88 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 50 రోజుల్లోనే వివక్ష చూపడమేంటని ప్రశ్నించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను నిలిపివేయడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచించి గ్రామాల అభివృద్ధికి ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాకపోవటం దురదృష్టవశాత్తు అని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ముఖ్యంగా రైతుబంధు ఇవ్వకపోవడంతో రైతులంతా వరి నాట్లు వేయకుండానే కాలం వెళ్లదీస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహించాలని తెలిపారు. ప్రజల నిర్ణయమే రాజకీయ నాయకులకు అనుభవం కలిగిస్తుందన్నారు. రాజకీయాల్లో అభివృద్ధి సహజమని శాశ్వతమైన పోస్టు మాజీగా మిగిలిపోవడమన్నారు. అనుభవ పూర్వకంగా చెబుతున్నానని, జిల్లాలో 93 కొత్త గ్రామపంచాయతీలు మంజూరు చేశామన్నారు. రూ.250 కోట్లతో గ్రామాల అభివృద్ధి జరిగిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధి జరిగిందన్నారు. కొత్త ప్రభుత్వం రాగానే కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను నిలిపివేయటమేంటని ప్రశ్నించారు. మండల వ్యాప్తంగా నాలుగు వేల ఇండ్లు మంజూరు చేశాం కానీ వాటిని నిలిపివేయడంతో మిగిలిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజు నాయక్, జెడ్పిటిసి కవిత, ఎంపీటీసీల పురం మండల అధ్యక్షులు గుంచరి ప్రవీణ్ కుమార్, సర్పంచులు ఎల్లం, ఎంపీటీసీ స్వప్న కిషోర్ గౌడ్, నాయికోటి లింగం, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మనోహర్ రెడ్డి, సంతోష్ కుమార్, ప్రతాప్ గౌడ్, దొంతల దుర్గయ్య శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రామాగౌడ్, నాయకులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



అంతర్జాతీయ కరాటే పోటీల్లో మెదక్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-మెదక్

అంతర్జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని రెంజుకి షాటోకాన్ వ్యవస్థాపకులు కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు. వర్ధనాకయమా షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రెండవ అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారన్నారు. కరాటే పోటీలకు ఇండియా, బుటన్, జపాన్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్, బాంగ్లాదేశ్‌తో పాటు సుమారు 30 దేశాలకు చెందిన 3000 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కరాటే పోటీలలో రెంజుకి షోటోకాన్ మెదక్ విద్యార్థులు పథకాలు సాధించినట్లు తెలిపారు. పథకాలు సాధించిన విద్యార్థులు గర్ల్స్ అండర్ కటాస్ విభాగంలో సుహానిక, నీక్షిత, జయశ్రీ, (సిల్వర్ మెడల్), గర్ల్స్ అండర్ 12 కటాస్ విభాగంలో జాన్సీ (గోల్డ్), సోమయ్య (సిల్వర్), గర్ల్స్ అండర్ 14 బ్లాక్ బెల్ట్ కటాస్ విభాగంలో నీతన్య సిరి (గోల్డ్), బాయ్స్ అండర్ 9 కటాస్ విభాగంలో దేవకుమార్ (గోల్డ్), శాంతి కుమార్ (గోల్డ్) రిత్విక్ (గోల్డ్) సోఫియాన్ (సిల్వర్), బాయ్స్ అండర్ 10 టీం కటాస్ విభాగంలో శ్రీరాజ్ (గోల్డ్), విహాన్ (సిల్వర్), బాయ్స్ అండర్ 11 కాటస్ విభాగంలో అఖిల్ (గోల్డ్), బాయ్స్ అండర్ 12 కాటస్ విభాగంలో మనివర్ధన్ (గోల్డ్) మొత్తం 8 బంగారు పతకాలు 6 వెండి పథకాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ దినాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంలో కొనసాగుతున్న స్వచ్ఛభారత్



నవతెలంగాణ-మనోహరాబాద్

గ్రామ స్వచ్ఛతే లక్ష్యంగా యువత గ్రామాభివృద్ధి స్వచ్ఛతకు పాటుపడుతున్నారు. తూప్రాన్ మండలంలోని ఆద్వర్శ గ్రామం మల్కాపూర్‌ను గతంలో ఉన్న కలెక్టర్ రోనాల్డ్ రోస్ దత్తత తీసుకుని మేకిన్ మల్కాపూర్ యువతను ఏర్పాటు చేశారు. దాంతో గ్రామంలో యువత చేపట్టిన కార్యక్రమాలు ఇతర జిల్లాలకు ఆదర్శంగా మారే విధంగా కార్యక్రమాలను చేపట్టి మల్కాపూర్‌ను ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు. అప్పటి నుంచి గ్రామంలో ప్రతి ఆదివారం యువత ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యమాలను చేపడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు. గత 399 వారాలుగా చేపడుతున్న స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామంలోని నాలుగో వార్డులోని గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. సీసీ రోడ్లను ఊడ్చి చెత్తను తొలగించారు. గ్రామంలో ప్రతి ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్టు ఉపసర్పంచ్ ఆంజనేయులుగౌడ్ పేర్కొన్నారు.

31న జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు

నవతెలంగాణ-మెదక్

మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నెల 31న జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలను నిర్వహించనున్నట్టు మెదక్ డిస్టిక్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అరునార్తి వెంకటరమణ, ఏ. మధుసూదన్‌లు తెలిపారు. తెలంగాణ స్టేట్ సబ్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ అండర్ 8, 10, 12, 14 బాలబాలికలకు రన్స్, త్రో, జంప్స్ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఫిబ్రవరి నెలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాలకు 9963005540 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సేవాలాల్ ద్వితీయ వార్షికోత్సవానికి హాజరైన మైనంపల్లి





నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామపంచాయతీ పరిధిలోని షౌకత్ పల్లి గ్రామ సేవాలాల్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. కరెంటు పోల్స్ అవసరం ఉన్నాయని హనుమంతరావును కోరగా వెంటనే కరెంటు డీఈకి ఫోన్లో మాట్లాడి స్తంభాలను ఇవ్వాలని ఆదేశించడంతో డీఈ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతి ద్వితీయ సంవత్సర వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మీ గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తానన్నారు. పేదవారు వైద్యం చేయించుకోవాలంటే నిమ్స్‌కు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సుప్రభాత రావు, రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మారుతి, ఎంఎస్ఎస్ఓ మండల ఇన్చార్జి వెల్పుర్తి వెంకటేష్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు అందే స్వామి, మధుసూదన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్, శ్రీకాంత్ గౌడ్స్, మహేష్, భూమా గౌడ్, రజక్ పల్లి నాగరాజ్, కోనాపూర్ సాగర్, లాలు, సురేష్, రాజు, లాలియా, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాతను దర్శించుకున్న రాజ్యసభ సభ్యులు



నవతెలంగాణ-పాపన్నపేట

ఏడుపాయల దుర్గామాతను ఆదివారం రాజ్యసభ సభ్యులు రవిచంద్ర దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ బట్టి జగపతి తదితరులు ఉన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-మర్కుక్

పరిధిలోని గణేష్ పల్లి గ్రామానికి చెందిన జంగా పోచమ్మ (60) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మర్కుక్ జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రామ చంద్రం యాదవ్, సర్పంచ్ మంజుల శ్రీరాములుతో కలిసి రూ. 4వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉప సర్పంచ్ మహేష్, నాయకులు రామరాజు, జయరాం, అమర్, నర్సింలు తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న చేరికల పరంపర

ఖాళీ అవుతున్న బీఆర్ఎస్ పార్టీ



నవతెలంగాణ-మనోహరాబాద్

తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో కాంగ్రెస్ పార్టీలో చేరికల పరంపర కొనసాగుతూనే ఉంది. రాబోయే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు పార్టీల పిరాయింపులను కొనసాగిస్తూనే ఉన్నారు. గత వారం రోజుల క్రితం రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్వెల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం తూప్రాన్ మండల ఎంపీపీ గడ్డి స్వప్న వెంకటేష్ యాదవ్‌తో పాటు ఇమాంపూర్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులుతో పాటు గ్రామంలోని ఇతర నాయకులు చాలా మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా తాజాగా ఆదివారం గజ్వెల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో ఉమ్మడి మండలాల పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొక్కొండ దీపక్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం నాగులపల్లి సర్పంచ్ తూప్రాన్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కావేరిగారి భగవాన్‌రెడ్డి పాలక వర్గంతో పాటు గ్రామంలోని చాలా మంది బీఆర్ఎస్ నాయకులు తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం జరుగుతుందని, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతుందని తెలిపారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేశామని, వంద రోజుల్లో మిగిలిన గ్యారెంటీలను అమలు చేసి ప్రజలకు సంక్షేమ పాలనను అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత మహెందర్‌రెడ్డి, సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, శశిభూషన్‌రెడ్డిలతో పాటు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వాలు మారినా పథకాలు నిరంతరంగా చేపట్టాలి

- ఎమ్మెల్యే సునీత లక్ష్మా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి





నవతెలంగాణ-కొల్చారం

గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరంగా కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు అన్నారు. మండలంలోని ఏటిగడ్డ మాందాపూర్, నాయిన్ జలాల్పూర్, కొంగోడు గ్రామాలలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏటిగడ్డ మాందాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ పేరోల్ల విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా పథకాలు నిరంతరాయంగా చేపట్టాల్సి అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గృహలక్ష్మి ఇళ్లను రద్దుచేసి ప్రజా పాలనలో మళ్లీ దరఖాస్తులు తీసుకుందన్నారు. ప్రజాపాలనలో తీసుకున్న దరఖాస్తుల్లో మహాలక్ష్మి, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు అడగకుండానే రైతుబంధు వేసి రైతులకు పెట్టుబడి ఇబ్బందులు లేకుండా చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కే దక్కిందన్నారు. పార్టీలు అనేవి ఎన్నికలప్పుడు మాత్రమే ఉండాలని, ఆ తర్వాత ప్రజల సంక్షేమం కోసం నిర్విరామంగా పనిచేయాలన్నారు. ఏటిగడ్డ మాందాపూర్‌లో మంజీరా వైపు వ్యవసాయ పొలాలకు రైతులు పోయే రోడ్డు పనుల పునరుద్ధరణ కోసం రూ.15లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు, వచ్చే వానకాలం వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కొరబోయిన మంజుల కాశీనాథ్, కిష్టాపూర్, కోనాపూర్, వెంకటాపూర్ సర్పంచ్లు గోదావరి, రమేష్, నెల్లి కిష్టయ్య, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు మన్సూర్ అహ్మద్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా, బీఆర్ఎస్ మండల యువత అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు, ఎంపీడీవో గణేష్ రెడ్డి, పంచాయతీరాజ్ డి అమరేశ్వర్, సహాయ ఇంజనీర్ ఇర్ఫాన్ హుస్సేన్, సిడిసి మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ కుమార్, రాజా గౌడ్, మల్ల గౌడ్, విజయేందర్ రెడ్డి, శ్రీశైలం, దొడ్ల ఆంజనేయులు, వడ్ల ప్రభాకర్, కరెంట్ రాజాగౌడ్, నింగొల్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలతోనే ఆయనపైన అవిశ్వాసానికి దిగాం

- స్వంత పార్టీలోనే ఉంటాం పార్టీ మారం
- ప్రజల పక్షాన నిలబడి అవినీతిని అడ్డుకుంటాం
- అవినీతికి వ్యతిరేకంగానే ఉద్యమిస్తున్నాం
- అవిశ్వాస తీర్మాణంపై ప్రజలంతా హర్షిస్తున్నారు.
- పది మంది కౌన్సిలర్లు



నవతెలంగాణ-మనోహరాబాద్

తూప్రాన్ మున్సిపల్‌లో చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్ చేపడుతున్న అవినీతి అక్రమాలకు విరుద్ధంగానే ప్రజల పక్షాన నిలబడి ఆయనపై అవిశ్వాసం పెడుతున్నామని, తామంతా బీర్ఎస్ పార్టీలోనే ఉండి అవిశ్వాసానికి దిగుతున్నట్టు అసమ్మతి కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఆదివారం వారంతా కలిసి ఒక ప్రకటనను విడుదల చేశారు. తూప్రాన్ మున్సిపల్‌లో చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్ ఒక నియంతలాగా ప్రజలపై పడి దోపిడీకి, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్టు పది మంది కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపల్‌లో తామంతా కూడా చైర్మన్ బాధితులమేనని పేర్కొన్నారు. మున్సిపల్‌లో ప్రతి దాంట్లో అవినీతికి పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. దాంతో ఆయనపై అవిశ్వాసం పెట్టేందుకే తాము ఏడుగురం కలిసి మరో ఇద్దరు కాంగ్రెస్ పార్టీ, మరొకరు బీజేపికి చెందిన కౌన్సిలర్ల మద్దతు తీసుకుని అవిశ్వాసానికి సిద్ధమైనట్లు పేర్కొన్నారు. కానీ తామేదో కాంగ్రెస్ పార్టీ నాయకుని మద్దతుతో అవిశ్వాసం పెడుతున్నట్టు, ఆయన తమకు మద్దతు తెలుపుతున్నారని తమపై చైర్మన్ వర్గం వారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తామే కాంగ్రెస్ బీజేపి పార్టీల కౌన్సిలర్ల మద్దతుతో అవిశ్వాసం తీర్మాణం ప్రవేశ పెడుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పటికి చైర్మన్ బాధితులమేనన్నారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగానే తాము బీఆర్ఎస్‌లో ఉంటూనే ఇతర పార్టీలతో కలిసి అవిశ్వాసం పెడుతున్నట్టు తెలిపారు. అవిశ్వాసం పెడుతున్నందుకు తూప్రాన్ ప్రజలంతా హర్షిస్తున్నారని, ఎవరు కూడా ఎందుకు పెడుతున్నారని కూడా అడగడం లేదని తెలిపారు. ప్రజలు చాలా మంది చైర్మన్ బొంది రాఘవెందర్ ద్వార అన్యాయానికి గురైన వారేనని తెలిపారు. మున్సిపల్ చైర్మన్‌ను గద్దెదింపడంతో పాటు అవినీతి రహిత మున్సిపల్‌గా తీర్చదిద్దడానికే ఇతర పార్టీల కౌన్సిలర్‌లతో కలిసి తామంతా పనిచేస్తున్నామని తెలిపారు. అయినప్పటికి చైర్మన్ వర్గం నుంచి తమ వెంట ఉన్న వారిని ప్రలోభాలకు గురిచేసి, వారి వెంట తీసుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. కానీ తామంతా అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నామని తెలిపారు. త్వరలోనే చైర్మన్‌పై తామంతా కలిసి అవిశ్వాసం తీర్మాణం ఇవ్వనున్నామని అవినీతికి పాల్పడుతున్న చైర్మన్‌ను దింపడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొడిప్యాక నారాయణగుప, నందాల శ్రీనివాస్, ఆర్ శ్రీశైలంగౌడ్, రవీందర్‌రెడ్డి, రాజు, మామిండ్ల కృష్ణ, చెలిమెల రఘుపతి, కాంగ్రెస్ పార్టీకి చెందిన జిన్న భగవాన్‌రెడ్డి, పల్లెర్ల రవీందర్‌గుప్త, బీజేపికి చెందిన జమాల్‌పూర్ నర్సోజి తదితరులున్నారు.

కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-చిన్న శంకరంపేట

మండల కేంద్రంలోని నూతన కళ్యాణ మండపాన్ని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. గ్రామ ప్రజల చిరకాల వాంఛ అయిన నూతన కళ్యాణ మండప నిర్మాణం పూర్తయింది. రూ.1.70 కోట్లు వెచ్చించి రాదేశ కళ్యాణ మండపాన్ని నిర్మాణం చేసినట్లు తెలిపారు. రాధా స్టీల్ కంపెనీ గ్రూప్ ఆఫ్ చైర్మన్ సునీల్ కుమార్ సరాఫ్ రూ.1.20 కోట్ల ఆర్థిక సహాయం చేశారని, శంకరంపేట గ్రామపంచాయతీ నిధుల నుంచి రూ.20 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. మరి కొంతమంది దాతల సహాయంతో విరాళాలు సేకరించి కుర్చీలు, వంట సామాగ్రి తదితర వస్తువులు సమకూర్చి నూతన కళ్యాణ మండపాన్ని నిర్మించినట్లు స్థానిక సర్పంచ్ రాజిరెడ్డి వివరించారు. మరికొంత మంది దాతల సహాయంతో చిన్నచిన్న పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ఎల్లవేళల సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాల మాటలు కట్టిపెట్టాలని ప్రజలకు సూచించారు. అంతకుముందు టీ మాందాపూర్ గ్రామపంచాయతీ భవనాన్ని, ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించారు, గవ్వలపల్లిలో నూతనంగా నిర్మించిన యువజన సామూహిక భవనాన్ని ప్రారంభించారు. గవ్వలపల్లి గెరిల్లా తండలో సీసీ రోడ్లను ప్రారంభించారు. మల్లుపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. రుద్రారం గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి రాజిరెడ్డి, ఉప సర్పంచ్ చిరంజీవి, రాధా స్టీల్ కంపెనీ గ్రూప్ ఆఫ్ సభ్యులు ఆయా గ్రామాల సర్పంచులు బిక్షపతి గౌడ్, మహేందర్, లక్ష్మణ్, లక్ష్మీ శంకరయ్య, మంగాదేవి యాదవరావు తదితరులు పాల్గొన్నారు.



అంసానిపల్లి సర్పంచ్‌తోపాటు పలువురు కాంగ్రెస్ లో చేరిక



నవతెలంగాణ- కొల్చారం

మండలంలోని అంసానిపల్లి గ్రామ సర్పంచ్ మన్నే శ్రీనివాస్‌తో పాటు మరికొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సహకార సంఘం చైర్మన్ మన్నె రాములు, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఆది నాగేశ్వర్ రావు, మాజీ ఎంపీటీసీ నారాయణలు సైతం ఆదివారం నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పర్చడం సంతోషకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు న్యాయం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మల్లేశం గౌడ్, నాయకులు గోవర్ధన్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవ తెలంగాణ కొండపాక



మండల కేంద్రమైన కొండపాక గ్రామానికి చెందిన దుంపలపల్లి జయమ్మ గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము విజయ్ కుమార్ పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఆరే భాస్కర్, ఆత్మ కమిటీ డైరెక్టర్ బొద్దుల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం మండల అధ్యక్షులు పర్శారాములు పాల్గొన్నారు.

పారితోషికం అందుకున్న టీచర్

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల మండలం వేచరేణి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మంగళగిరి రామచంద్రమూర్తి ఇటీవల విద్యార్థులచే వేచరేని వెలుగులు అనే కవితా సంపుటిని వెలువరించారు. శనివారం సాయంత్రం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంగా పనిచేస్తున్న చింతోజు బ్రహ్మయ్య మెమోరియల్ వారు బాల ప్రతిభా పురస్కారం, నగదును చింతోజు శంకర్ రాజారాం అందించగా గరిపెల్లి అశోక్ గారు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయ బృందం మూర్తి కి ప్రశంసా పత్రం, నగదును అందించి అభినందనలు తెలిపారు. నిత్యం విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభ ను వెలికి తీస్తూ సృజనాత్మక రచనలు చేయిస్తూ ఉన్న మూర్తి ఇప్పటికే పిల్లలచే 13 పుస్తకాలు సంకలనాలు ఆవిష్కరించడమేకాకుండా స్వయంగా సుమారు 25 పుస్తకాలను ఆవిష్కరించాడు. విద్యార్థుల సంపూర్ణ వికాసం కోసం భాషా నైపుణ్యాలను తనదైన సృజనాత్మక ప్రతిభ తో తీర్చి దిద్దుతున్న మూర్తిని హెచ్ఎం, సర్పంచ్ యేనుగుల దుర్గయ్య, ఎస్ఎంసీ చైర్మన్ యాదగిరి అభినందించారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



నవ తెలంగాణ - పటాన్ చెరు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుపై కనబరిచిన శ్రద్ధ క్రీడలపై లేదని, జీవితంలో క్రీడలు భాగం కావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అభిలషించారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు గౌతం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంగారెడ్డి జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్‌ను కబడ్డీ జాతీయ క్రీడాకారుడు శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వతహాగా క్రీడాకారుడైన తాను కబడ్డీ క్రీడను ఎంతగానో ఆస్వాదిస్తానని తెలిపారు. తనకు ఇష్టమైన క్రీడల్లో కబడ్డీ మొదటి స్థానంలో ఉంటుందని తెలిపారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. ముత్తంగిలో జిల్లాస్థాయి రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉపేందర్, కబడ్డీ సంఘం జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, ఉప సర్పంచ్ లింగా రెడ్డి పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను తుంగలో తొక్కిన పరిశ్రమ

- మద్దతు తెలిపిన సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య
- మానాక్సియా కంపెనీ వద్ద కార్మికుల ఆందోళన
- యంత్రాలను తీసుకుపోకుండా అడ్డగింపు
- యాజమాన్యంతో కుమ్మక్కైన బీఎంఎస్



నవతెలంగాణ ఐడీఏ బొల్లారం

మానాక్సియా కంపెనీ కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య అన్నారు. బొల్లారంలోని మానాక్సియా కార్మికులు ఆదివారం ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.రాజయ్య వెంటనే పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. కార్మికులు చేస్తున్న ఆందోళనకు కె.రాజయ్య మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానాక్సియా పరిశ్రమ ఐదు సంవత్సరాల క్రితం అక్రమ లాకౌట్ చేసిందని అన్నారు. లాకౌట్‌కు ప్రభుత్వ అనుమతి లేదన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు కార్మికులతో ఏమాత్రం చర్చలు జరపకుండా, వాళ్లకు సెటిల్మెంట్ చేయకుండా, నష్టపరిహారం చెల్లించకుండా యంత్రాలు తీసుకుపోయే కుట్ర పన్నిందన్నారు. ఈ కుట్రను కార్మికులు అడ్డుకున్నారన్నారు. వెంటనే కార్మికులకు నష్టపరిహారం చట్టప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం చెల్లించకుండా యంత్రాలు తరలిస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. పరిశ్రమ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్మికులను పరిశ్రమ యాజమాన్యం గోరంగా మోసం చేసిందన్నారు. బోనస్ వేతనాలు, గ్రాటిటీ, కార్మికుల రావాల్సిన చట్టపరమైన ఏ ఒక్కటి ఇప్పటిదాకా ఇవ్వలేదని అన్నారు. అక్కడ అధికారంలో ఉన్న బీఎంఎస్ యూనియన్ ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. కార్మికులను గాలికి వదిలేసిందన్నారు. కార్మికుల పోరాటానికి పూర్తిగా అండగా నిలబడతామన్నారు. ఈ విషయాన్ని సీఐ దృష్టి కూడా తీసుకువెళ్లారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, శివ ,రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



నవతెలంగాణ-గజ్వేల్

బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ప్రవీణ్ అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని రెండో వార్డులో క్యా సారం గ్రామంలో ఇటీవల అంగన్వాడి టీచర్ వరలక్ష్మి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించినట్లు ఆయన తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు. నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని ఆయన చెప్పారు.

బస్టాండ్ ప్లాట్ ఫాంకి చెర్లంకిరెడ్డిపల్లి గ్రామం పేరు

నవతెలంగాణ-చిన్నకోడూరు



సిద్దిపేట పాత బస్టాండ "(మోడర్న్ న్యూ బస్టాండ్)లో ఒక ప్లాట్ ఫాం పైన సపరేట్‌గా చెర్లంకిరెడ్డిపల్లి ఊరు పేరు ఉండాలనే ఎన్నో ఏళ్ల కల నేటికీ సాకారమైంది. బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌తో ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా యువ నాయకులు అజ్జు యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను పొన్నం ప్రభాకర్‌కు తెలియజేయగా, అతి తక్కువ సమయంలో ప్లాట్ ఫాంపై గ్రామ పేరు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామస్థులు ప్రతి ఒక్కరూ బస్సు సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని మంత్రి ప్రభాకర్ సూచించారు.

లచ్చపేటలో డాక్టర్ పద్మనాభం మెమోరియల్ షటిల్ టోర్నమెంట్



నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేటలో దివంగత డాక్టర్ బచ్చు పద్మనాభం మెమోరియల్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఇండోర్ షటిల్ టోర్నమెంట్ పోటీలు జరిగాయి. మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 48 జట్లు పాల్గొనగా ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో దుబ్బాక జట్టు విజేతగా నిలిచింది. దుబ్బాక టీం-లక్ష్మణ్, అరవింద్‌లు విజేతలుగా, లచ్చపేట టీం-పల్లె శ్రీను, ప్రశాంత్‌లు రన్నర్‌గా నిలిచారు. విజేత టీంకు రూ.5555, రన్నర్ టీంకు రూ.3333 నగదుతో పాటు మెమోంటోలను బచ్చు పద్మనాభం కుటుంబీకులు డాక్టర్ బచ్చు దీపక్, డాక్టర్ చైతన్యలు అందజేశారు. పదో వార్డ్ కౌన్సిలర్ కూరపాటి బంగారయ్య, సివిల్ క్లబ్ అధ్యక్షుడు ఎర్రగుంట ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు నందాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-జగదేవపూర్

మండల పరిధిలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన నీల కర్ణాకర్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కర్ణాకర్‌తో కలిసి పదవ తరగతి చదువుకున్న స్నేహితులు అందరూ కలసి కర్ణాకర్ కుటుంబానికి రూ.14 వేల ఆర్థిక సహాయం అందించారు. కర్ణాకర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన వారిలో స్నేహితులు మచ్చ బాబు, ఏజాస్, అలీం, దేవేందర్, సురేష్, శ్రీకాంత్, కర్ణకర్, గణేష్ మహేష్ తదితులున్నారు.

గ్రామాల అభివృద్ధికి కేసీఆర్ పెద్దపీట





సర్పంచుల సన్మాన సభలో వంటేరు ప్రతాప్‌రెడ్డి

నవతెలంగాణ -గజ్వేల్

గ్రామాల అభివృద్ధికి గజ్వేల్ ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేసినట్లు తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ వంటేరు వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. సర్పంచుల పదవీ కాలం ఫిబ్రవరి 2తో ముగుస్తున్నందున ఆదివారం గజ్వేల్ పట్టణంలో నియోజకవర్గంలో ఉన్న గ్రామ సర్పంచులకు, ఉప సర్పంచ్లకు ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా గజ్వేల్ నియోజకవర్గం లో 175 గ్రామపంచాయతీలో అభివృద్ధి శరవేగంగా జరిగిందని ఆయన అన్నారు. 50 సంవత్సరాల నుండి జరిగిన అభివృద్ధి 10 సంవత్సరాల్లో గజ్వేల్ నియోజకవర్గం లో పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి గ్రామ సర్పంచి, ఉప సర్పంచ్ పాలకవర్గం ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు. నియోజకవర్గానికి నిధుల కొరత లేకుండా అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గ్రామాలు వివరించాలని తిరిగి రిజర్వేషన్ల ప్రకారం మళ్లీ వస్తే పోటీ చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామంలో తెలంగాణ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని కరపత్ర రూపంలో ముద్రించి ఇంటింటికి పంపించేసుకోవాలన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన దానికంటే ఎక్కువ నిధులు ఇచ్చి అభివృద్ధికి సహకరించినట్లు ఆయన అన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా కేసీఆర్ ఉండటంతో రెండోసారి సర్పంచులుగా ఎన్నికైన మీకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయన అన్నారు. ఎమ్మెల్యే కోట కింద వచ్చే నిధులను గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల పేరిట ప్రజలను గారడి చేసి అధికారంలోకి వచ్చిందని ఆయన విమర్శించారు. ఫిబ్రవరి 4తో రెండు నెలల పరిపాలన పూర్తవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయలేకపోతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ భూమిరెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడేఎం కృష్ణారెడ్డి.యోజకవర్గంలోని ఎంపీపీలు జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

కూటిగల్ కాంగ్రెస్ గ్రామ శాఖ యూత్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని కూటిగల్ కాంగ్రెస్ గ్రామ శాఖ యూత్ కమిటీలను వేసినట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చేట్కూరి కమలాకర్ యాదవ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ శాఖ అధ్యక్షునిగా పాకాల హరిభూషన్, ఉపాధ్యక్షులుగా బండి కమలాకర్ గౌడ్, కార్యదర్శులుగా పారుపల్లి బాలరాజు, గొనేపల్లీ వేణు, కార్యవర్గ సభ్యులుగా, దాసరం సుధాకర్, పొన్నం రాజు, సిరిమల్ల రాజు, ఎండీ అఫ్సర్, చెన్నమల్ల రాకేష్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా శ్రీరాముల ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా దాసారం రాజు, కార్యదర్శిగా సిరిమల్ల భారత్, కార్యవర్గ సభ్యులుగా రాజ్‌కుమార్, రాజు, బాలరాజులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కామిడీ జీవన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఆరే సాయిలు, లింగపూర్, ఉప సర్పంచ్ జెల్లా స్వరూప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్



నవ తెలంగాణ-సిద్దిపేట

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వచ్చే నెల 16న నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మె, రైతాంగ బందును విజయవంతం చేయాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్ కోరారు. పట్టణంలోని హెచ్ఎంఎస్ సిద్దిపేట జిల్లా బీడీ కార్మిక సంఘం కార్యాలయంలో మిరుదొడ్డి, అక్బర్ పేట భూంపల్లి, తొగుట, దుబ్బాక, చిన్న కోడూర్, నంగునూర్, సిద్దిపేట మండలాల బీడీ కార్మికులు, రైతు సంఘం కార్మికులతో ఆదివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేస్తూ, యజమాన్యాలకు ఉపయోగపడేలా నాలుగు కార్మిక చట్టాలుగా రూపొందించిందన్నారు. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసన తెలుపుతామన్నారు. అదేవిధంగా ప్రతి కార్మికునికి గరిష్ట పెన్షన్ రూ 10000 ఇవ్వాలని, అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రేషన్ షాపులలో 14 రకాల వస్తువులను ఉచితంగా అందివ్వాలన్నారు.

హెచ్ఎంఎస్ సిద్దిపేట జిల్లా బీడీ కార్మిక సంఘం అధ్యక్షులు ఇధారి మల్లేశం మాట్లాడుతూ బీడీ కార్మికులకు 41 జీవోను రద్దుచేసి, బదులుగా సరి సమానమైన కొత్త జీవోను తీసుకొచ్చి కార్మికులకు సరియైన వేతనాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో మాదాసు రాములు సిద్దిపేట జిల్లా బీడీ కార్మిక సంఘంలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మధు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా నాయకులు రాములు, నాయకులు రమేష్, నగేష్, కృష్ణ, బోయిని నర్సింలు, కౌసల్య, లలిత, రాజేశ్వరి, అనిత, రామచంద్రం, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జూనియర్ ఛాంపియన్ పోటీలకు తెలంగాణ జట్టు నుంచి ఇద్దరికి చోటు





నవ తెలంగాణ -గజ్వేల్

జాతీయ జూనియర్ 49వ ఛాంపియన్షిప్ పోటీలకు తెలంగాణ జట్టు నుండి ఇద్దరికి చోటు దక్కినట్లు సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు నేతి చిన్న సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్ తెలిపారు. ఆదివారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ జనవరి 11 నుంచి 14 వరకు గజ్వేల్లో నిర్వహించిన 49వ జూనియర్ ఛాంపియన్షిప్ కబడ్డీ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జూనియర్ ఛాంపియన్ కబడ్డీ జట్టు నుంచి ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మాధవి, లారేన్ ను.ఎంపిక చేసినట్లు వారు చెప్పారు. బాలికల విభాగంలో మాధవి (రేట్ కవర్) బాలుర విభాగంలో లారెన్(రైటర్)గా ఎంపికైనట్లు వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే బాచుపల్లి లో ఫిబ్రవరి 1వ తేదీ నుండి నాలుగో తేదీ వరకు కాసాని కౌసల్య మెమోరియల్ 49వ జూనియర్ జాతీయ ఛాంపియన్షిప్ 2024 పోటీలను తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నమన్నారు. అదేవిధంగా రాష్ట్ర కబడ్డీ జట్టు మేనేజర్ గా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ను ఎంపిక చేయడం రాష్ట్ర కబడ్డీ జట్టు మేనేజర్ గా సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్ ను ఎంపిక చేశారని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్, అండ్ ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, వైస్ చైర్మన్ జుబేర పాషా, మహిళా కమిషన్ చైర్మన్ రాజ్యలక్ష్మి, కోశాధికారి సత్యం, సంయుక్త కార్యదర్శి మహేష్, శ్రీకాంత్, నరేంద్రబాబు, కర్ణాకర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీష్ యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించడమే ఏకైక లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో వారికి అన్ని విధాల శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి ప్రణాళికలతో క్రీడారంగంలో గుర్తింపు చేస్తామన్నారు.

రాష్ట్ర కబడ్డీ జట్టు మేనేజర్‌గా శివకుమార్



నవతెలంగాణ- గజ్వేల్

ఇటీవల గజ్వేల్‌లో నిర్వహించిన 49వ చాంపియన్షిప్ పోటీలను విజయవంతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టు మేనేజర్‌గా శివకుమార్ నియమిస్తున్నట్లు అంతర్జాతీయ కబడ్డీ, ఒలంపిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్ తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ కమిటీ ఓ ప్రకటనలో తెలిపారు.. తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాల నుండి 68 జట్లను తీసుకొచ్చి కబడ్డీ క్రీడలు గజ్వేల్ లో ఘనంగా నిర్వహించినట్లు ఆయన గుర్తు చేశారు. ఇదే తరుణంలో ఫిబ్రవరి ఒక్కడి నుండి నాలుగు వరకు జరిగే జూనియర్ జాతీయ ఛాంపియన్షిప్ పోటీలకు ముందు రాష్ట్ర కబడ్డీ జట్టు మేనేజర్ గా శివకుమార్ ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. అన్ని క్రీడలను విజయవంతం చేస్తున్నారని ఆయన చెప్పారు.

అందరికీ కృతజ్ఞతలు: శివకుమార్

తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర కబడ్డీ జట్టు మేనేజర్‌గా నియమించినందుకు శివకుమార్ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న కాలంలో ఏ బాధ్యత అప్పగించిన అందరి సహకారంతో విజయవంతం చేస్తానని ఆయన తెలిపారు. గజ్వేల్ లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు తనకెంతో గుర్తింపు తెచ్చినట్లు ఆయన అన్నారు. గజ్వేల్ లో ఉన్న అందరూ సహకారం చేయడంతోనే ఈ గుర్తింపు వచ్చిందని ఆయన చెప్పారు. ఒలంపిక్ జాతీయ ప్రధాన కార్యదర్శి జగదీష్ యాదవ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సంతోష్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి, వైస్ చైర్మన్ జుబేర్ భాష, మహిళా కమిషన్ చైర్మన్ రాజ్యలక్ష్మి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పుల్లూరు బండ దేవస్థానం చైర్మన్‌గా కనకయ్యగౌడ్



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

పుల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్‌గా పుల్లూరు కనకయ్యను నియమిస్తూ కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ నియామక పత్రాన్ని అందజేశారు. చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌గా ఒగ్గు యాదగిరి, ఐరేని దేవి రెడ్డి, బెస్త రాములు, గొడుగు రవి, పెద్ద కర్రే కిష్టయ్య, వడాల కనకయ్యలను నియమించారు. ఈ సందర్భంగా కనకయ్య గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో చైర్మన్‌గా నియమించినందుకు ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు, దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దేవస్థానంకు సిద్దిపేటలో ముందంజ ఉండే విధంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గరిపల్లి రాములు, అంజిరెడ్డి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, రామస్వామి, ఐరేని రాజిరెడ్డి, గొడుగు శీను, యూత్ మండల అధ్యక్షుడు శివప్రసాద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అనాథను అక్కున చేసుకున్న ఇసాక్



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన గూడు నీడ లేని అనాథ జానవ్వను ప్రేయర్ పవర్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ టీ ఇసాక్ అక్కున చేర్చుకున్నారు. వృద్ధురాలికి తన సొంత ఖర్చులతో గది నిర్మించి ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. పాస్టర్ ఇసాక్‌ను పలువురు అభినందించారు. జానమ్మకు పాములపర్తి గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇల్లు వచ్చినా రాజకీయ నాయకుల అండదండలతో జాన్నమ్మకు ఇల్లు రాకుండా చేయడం గమనార్హం.